ఫిట్‌నెస్ మరిస్తే ప్రమాదమే

- కండీషన్‌లేని బస్సులు
- ప్రమాణాలు పాటిస్తేనే పిల్లలకు భద్రత
- పట్టించుకోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు



సత్యవేడులో ప్రైవేటు పాఠశాలల బస్సుల రికార్డులు పరిశీలిస్తున్న సత్యవేడు సీఐ మురళి నాయుడు

తాము పడిన కష్టం పిల్లలు పడకూడదని ప్రతి తల్లీ, తండ్రీ కోరుకుంటారు. అందుకే ఎంత కష్టమైనా భరించి మంచి చదువులు చదివించాలని అనుకుంటారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల సర్కారు బడులు నిర్వీర్యం అవుతుండడంతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ బస్సు ఫీజులు వసూలు చేస్తూ సౌకర్యాలు విస్మరిస్తున్నారు. కండీషన్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాల్లో 26 దాకా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలు మరో 17 దాకా ఉన్నాయి. ఈ పాఠశాలలు, కాలేజీలకు సంబంధించి 115కి పైగా ప్రైవేటు బస్సులు ఉన్నాయి. వీటిలో అనేక పాత బస్సులకు రంగులు వేసి సొబగులు అద్ది తిప్పుతున్నారు. ఫిట్‌నెస్, కండీషన్ సరిగ్గా లేకున్నా రవాణాశాఖ అధికారులను మేనేజ్ చేసుకుని యథేచ్ఛగా తిప్పుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

పరిమితికి మించి ప్రయాణం

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కాసుల కక్కుర్తితో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించి పాఠశాలలకు చేరవేస్తున్నారు. నిబంధనల మేరకు చిన్న బస్సులో 24 మంది, పెద్ద బస్సులో 55 మంది విద్యార్థులను ఎక్కించుకోవాల్సి ఉంది. చిన్న బస్సులో 40 నుంచి 50 మంది, పెద్ద బస్సులో 90 నుంచి 100 మంది పైగా ఎక్కిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రవాణా, విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గమనార్హం.

పాటించాల్సిన నిబంధనలు

- పాఠశాల బస్సులో తగిన సౌకర్యాలు కల్పించాలి.
- నిబంధనలు మేరకు బస్సులో పిల్లలను ఎక్కించాలి.
- బస్సులో అగ్ని ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు పిల్లలు బయటపడడానికి అత్యవసర ద్వారం ఉండాలి.
- డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం, లైసెన్స్ ఉండాలి.
- డ్రైవర్ ఆరోగ్య, మానసిక పరిస్థితిపై వైద్యులు పరీక్షలు చేసిన ఇచ్చిన ధ్రువీకరణ పత్రం ఉండాలి.
- బస్సులో తప్పకుండా అటెండర్ ఉండాలి. విద్యార్థుల హాజరు పట్టికను నమోదు చేయాలి.
- బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉండాలి.
- పిల్లలు బస్సు ఎక్కడానికి అనువుగా మెట్లు ఉండాలి.

మండలం	పాఠశాలలు	కాలేజీలు	బస్సులు
సత్యవేడు	04	-	06
వరదయ్యపాళెం	05	-	20
బీఎన్‌కండ్రిగ	04	02	15
కేవీబీపురం	03	-	07
నారాయణవనం	03	12	40
పిచ్చాటూరు	04	01	20
నాగలాపురం	03	02	06

ప్రమాదాలు జరిగితేనే తనిఖీలా?



రాష్ట్రంలో ఎక్కడైనా బస్సు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం రవాణా అధికారులు, పోలీసులు తనిఖీలు చేస్తారు. మళ్లీ మొద్దునిద్ర పోతారు. దీంతో పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటే ఇలా జరగదు.

– తరుణ్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు, వరదయ్యపాళెం

తనిఖీలు నిర్వహిస్తున్నాం



పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల బస్సులపై నిఘా ఉంచాం. బస్సుల్లో వెళ్తున్న విద్యార్థుల సంఖ్య, బస్సుల కండిషన్, డ్రైవర్ల లైసెన్సులను పరిశీలిస్తున్నాం. కాలం చెల్లిన బస్సులు నడిపితే సీజ్ చేస్తాం. బస్సులు కండీషన్‌లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం.

–మురళీనాయుడు, సీఐ, సత్యవేడు

క్లుప్తంగా

స్కూల్ బస్సుల కండీషన్ తనిఖీ

సత్యవేడు: పట్టణంలో ఐదు ప్రైవేటు స్కూల్ బస్సుల కండీషన్‌ను సీఐ మురళీ నాయుడు సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సులను అతివేగంతో నడపరాదని హెచ్చరించారు. పిల్లల్ని సురక్షితంగా పాఠశాలకు, ఇంటికి తీసుకుపోయే బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. వాహనాల రికార్డులు పరిశీలించారు. ఎస్ఐ రామస్వామి, పట్టణంలోని శ్రీ విద్యా హైస్కూల్, సన్‌రైస్ హైస్కూల్, మాస్టర్ స్కూల్, దాసు డిగ్రీ, బాబు కళాశాల కరస్పాండెంట్లు నాగయ్య, సతీష్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి,పరంధాం పాల్గొన్నారు.

స్థానికులకే స్థలాలు ఇవ్వాలి


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు గ్రామ రెవెన్యూలోని లే అవుట్‌లోని ఇంటి స్థలాలను స్థానికులకే ఇవ్వాలని తలారివెట్టు, కల్లివెట్టు, వేణుగోపాలపురం గ్రామస్తులు డిమాండ్ చేశారు. వారు సోమవారం తహసీల్దార్ శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

సత్యవేడు ఉపఖజానా అధికారిగా ఈశ్వరయ్య


ఈశ్వరయ్యను సత్కరిస్తున్న ఎంపీడీఓ

సత్యవేడు: సత్యవేడు ట్రెజరీ(ఉప ఖజానా) అధికారిగా ఈశ్వరయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తొట్టంబేడు ఎస్టీవోగా పనిచేస్తూ బదిలీపై సత్యవేడుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపఖజానా అధికారి గోకులేంద్ర ప్రసాద్ కుప్పం బదిలీ అయ్యారు. ఆయనకు ఇన్‌చార్జి ఎంపీడీవో త్రివిక్రమరావు, జూనియర్ అసిస్టెంట్ నందకుమార్ శాలువా కప్పి సత్కరించారు.

టీచర్లకు ఘన స్వాగతం


స్వాగతం పలుకుతున్న ఎస్టీయూ నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ: బదిలీల్లో భాగంగా వివిధ మండలాల నుంచి బుచ్చినాయుడుకండ్రిగ మండలానికి వచ్చిన ఉపాధ్యాయులకు సోమవారం ఎస్టీయూ నేతలు ఘన స్వాగత పలికారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి వెంకటేష్ యువశ్రీ మురళీ, జగన్నాథం, శారదమ్మ, నాదెండ్ల మురళీ, లీలాప్రసాద్, బాలసుబ్రమణ్యం, విమల, నందిని, బాలకృష్ణ, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం రేపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. మేధా గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఉదయం 9 గంటలకు అక్షరాభ్యాసం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు నిర్మించాలని వినతి

రేణిగుంట: స్థానిక బీసీ హాస్టల్‌కు వెళ్లే రోడ్డు పునర్నిర్మించాలని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు ఎంపీడీఓకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జన విజ్ఞాన వేదిక కన్వీనర్ కార్యదర్శి కుప్పస్వామి, విద్యా వికాస వేదిక కన్వీనర్ ఓ.వెంకటరమణ ఎంపీడీఓను కలసి బీసీ హాస్టల్‌కు రోడ్డు వేయాలని కోరారు.

నేడు పాలస్తీనా సంఘీభావ దినం

శ్రీకాళహస్తి: గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను ఖండిస్తూ స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం పాలస్తీనా సంఘీభావ దినం నిర్వహించనున్నట్లు సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

పాలంలోకి దూసుకెళ్లిన కారు


పొలంలోకి దూసుకెళ్లిన కారు

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని జేబీఆర్ కలాశాల వద్ద సోమవారం పుత్తూరు–చెన్నై బైపాసు రోడ్డులో వెళుతున్న కారు ఉన్నట్టుండి పొలంలోకి దూసుకెళ్లింది. పోలీసుల కథనం మేరకు.. పిచ్చాటూరు మండలంలోని టీచర్స్ కాలనీకి చెందిన విశ్వనాథ్ సొంత పనుల నిమిత్తం కారులో అప్పంబేడుకు బయలుదేరాడు. జేబీఆర్ కళాశాల వద్ద కారు బ్రేక్ ఫెయిల్ అయి అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేశులు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

తొట్టంబేడు: మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ప్రముఖ సంఘ సేవకులు కలవగుంట భరత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాలంలో తొట్టంబేడు మండలంలో విద్యుత్ కోతలు ఎక్కువ కావడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రామచంద్రాపురం ప్రాంతంలో రోజూ గంటల తరబడి విద్యుత్ కోత విధిస్తున్నారని, రోజుకు పదిసార్లు గంటల కొద్ది విద్యుత్ కోత విధిస్తున్నారన్నారు.

పరంధామరెడ్డి మృతి బాధాకరం


నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మండలంలోని నాగనందాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పరంధామరెడ్డి మృతి బాధాకరమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. ఆయన సోమవారం నాగనందాపురం గ్రామానికి చేరుకుని పరంధామరెడ్డి మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన కుమారులు విజయ్ రెడ్డి, సురేష్ రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట దయాకర్ రెడ్డి, బీరేంద్ర వర్మ, చిన్నా, దామోదర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి ఉన్నారు.

మహిళా నేతకు పరామర్శ

కేవీబీపురం: కళత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దశరథరామిరెడ్డి భార్య తాటిపర్తి లక్ష్మమ్మ వారం రోజుల క్రితం ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆ పార్టీ సత్యవేడు సమన్వయ కర్త నూకతోటి రాజేష్ సోమవారం కళత్తూరుకు చేరుకుని ఆమెను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, గవర్ల క్రిష్ణయ్య, ఐటీ విభాగం సత్యవేడు అధ్యక్షుడు వేనాటి చందూరెడ్డి, లాల్‌బాబు యాదవ్, మాధవీరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చిరంజీవి, మాజీ జెడ్పీటీసీ డేవిడ్, బీసీ సెల్ అధ్యక్షుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

21న పాలిటెక్నిక్ అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్

సత్యవేడు: పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల కోసం 21 నుంచి 28వ తేదీ వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి తొలిసారిగా సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు కౌన్సెలింగ్ కేంద్రం కేటాయించిందని తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి సర్టిఫికెట్లు పరిశీలిస్తామన్నారు. కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్ కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని తెలిపారు. 15 వేల ర్యాంకులోపు విద్యార్థులకు 21న, 32 వేల లోపు ర్యాంకు విద్యార్థులకు 22న, 50 వేల ర్యాంకు పొందిన విద్యార్థులకు 23న, 68 వేలలోపు ర్యాంకు పొందిన వారికి 24న, 86 వేల లోపు ఉన్న వారికి 25న, మిగిలిన వారికి 28వ తేదీ వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్సు కాపీలు తీసుకురావాలన్నారు. పాలిసెట్ హాల్ టికెట్, ప్రాసెసింగ్ ఫీజు రసీదు, ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్కుల లిస్టు, 4 నుంచి 10వ తరగతి వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్లు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

ఏఐటీయూసీ నూతన కార్యవర్గం



శ్రీకాళహస్తి: ఏఐటీయూసీ శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా కార్తీక్, తొండు మల్లికార్జున్ ఎన్నికయ్యారు. శ్రీకాళహస్తిలోని అంబేడ్కర్ భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఏఐటీయూసీ నియోజకవర్గ మహాసభలు సోమవారంతో ముగిశాయి. అందులో భాగంగా ఏఐటీయూసీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా వైఎస్ మణి, అధ్యక్షుడిగా కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా తొండు మల్లికారుజన్, కోశాధికారిగా మురళి, ఉపాధ్యక్షులుగా శశిరేఖ, రాజేశ్వరి, హరి, చంద్రకళ, పాండు, గురు, బాలాజీ గోవర్ధన్, సహాయ కార్యదర్శులుగా మస్తాన్, శ్రీధర్, గిరి, ఉమ, చంద్రయ్య, దిలీప్, రజాక్, కౌన్సిల్ ఎన్నికయ్యారు. సభ్యులుగా రమణ,సెల్వ, సుబ్బరాజు, సుబ్రహ్మణ్యం, జనార్దన్, అయ్యప్ప, రవీంద్ర, భాను, రమేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ పాల్గొన్నారు.

బెల్ పరిశ్రమను విస్మరించడం బాధాకరం


నిరసన తెలుపుతున్న చింతామోహన్, బత్తెయ్యనాయుడు

శ్రీకాళహస్తి: బెల్‌పరిశ్రమను విస్మరించడం బాధాకరమని తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు బెల్ పరిశ్రమకు భూమి పూజ చేశారన్నారు. అయితే ఆ తరువాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ దాన్ని విస్మరించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ బత్తెయ్యానాయుడు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిని తగ్గించవద్దు

సత్యవేడు: మండలంలోని నీళ్లతొట్టి కండ్రిగ ప్రాథమిక పాఠశాల స్థాయిని తగ్గించవద్దని గ్రామస్తులు కోరారు. వారు సోమవారం ఎంఈఓ రవికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలను రెండో తరగతి వరకే కుదించడం సమంజసం కాదన్నారు. ఇక్కడి పిల్లలను కాళమనాయుడు పేట పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం యోగాపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్


మాట్లాడుతున్న విద్యాశాఖాధికారులు

రేణిగుంట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు విద్యాశాఖాధికారులు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.మండలంలోని వెదళ్లచెరువు ఎస్టీ కాలనీలో ఎంఈఓ రంగనాథయ్య, గుత్తివారిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేఘనాథ్, ఉపాధ్యాయులు కాలనీలో ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు.

ముక్కంటి సేవలో సుద్దాల



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని సోమవారం తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత సుద్దాల అశోక్ తేజ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా కళావేదిక వ్యవస్థాపకుడు అరవ జయపాల్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

వరదయ్యపాళెం: మండలంలోని అంబికాపురం పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విద్యా సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాకానుక కిట్లు, తల్లికి వందనం ఎంతో ఉపయోగపడతాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, నాయకులు జయశంకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మైక్ నంద పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేకు అధికారుల డుమ్మా


ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నారు. అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. అధికారులు హాజరుకాకపోవటంతో కుర్చీలు ఖాళీగా దర్శమిచ్చాయి. మండల స్థాయి అధికారులే తీరు ఇలాఉంటే కిందస్థాయి ఉద్యోగుల పనితీరు ఎలా ఉంటుందోనని మండల ప్రజలు అంటున్నారు. అధికారుల తీరుపై తహసీల్దారు శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అధికారులు గ్రీవెన్స్‌డేకు హాజరయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మరాఠీపురం భూములపై విచారణ


మరాఠీపురంలో విచారిస్తున్న అధికారులు

ఏర్పేడు: మండలంలోని చింతలపాళెం పంచాయతీ మరాఠీపురంలోని వివాదాస్పద భూముల విషయమై సోమవారం అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. మరాఠీపురానికి చేరుకున్న వారు అక్కడున్న షికారీలను విచారించారు. డీఆర్వోలు సికిందర్ ఎస్.గౌస్‌కరీం అక్కడకు వెళ్లి షికారీలతో మాట్లాడారు. గ్రామంలో రైతులకు, తమకు మధ్య భూవివాదం ఉందని, ఈ భూముల్లో అటవీశాఖ పరిధిలోని భూములేవీ లేవని స్థానికులు వారివి వివరించారు. తాము అటవీఫల సాయం సేకరణ విషయంలో అటవీశాఖ సిబ్బంది ఎవరూ తమను ఇబ్బంది పెట్టడం లేదన్నారు. కార్యక్రమంలో పాపానాయుడుపేట సెక్షన్ ఆఫీసర్ శంకరప్ప, ఎఫ్‌బీఓలు శోభారాణి, పురుషోత్తం పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని అంగన్‌వాడీల ధర్నా


నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అంగన్‌వాడీ సిబ్బంది డిమాండ్ చేశారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని తెలిపారు. రూ. 12 వేలు, రూ. 7 వేలు జీతాలు తీసుకునే తమని ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించి, పథకాలకు అనర్హులను చేస్తున్నారని పేర్కొన్నారు. అధ్యక్షురాలు ప్రమీలమ్మ, కార్యదర్శి సుదర్శనదేవి పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖర్ రావు

రేణిగుంట: ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో సోమవారం విద్యుత్ సిబ్బంది, వినియోగదారులకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ శాఖ నోడల్ ఆఫీసర్, టెక్నికల్ ఈఈ వాసవీలత, ఈఈ చంద్రశేఖర్ రావు, విశ్రాంత ఎస్ఈ దేవేంద్ర నాథరెడ్డి, డీఈ రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు ఇప్పుడు ఒక చైతన్యాన్ని సృష్టిస్తున్నాయన్నారు. ఇవి మీ ఇంటికి మాత్రమే కాదు, సమాజానికి, భూమి భవిష్యత్తుకు ఒక గొప్ప బహుమతి అన్నారు. సోలార్‌పై ఖర్చు పెడుతున్నామని అనుకోకుండా పెట్టుబడి చేస్తున్నామని, ఇది మన భవిష్యత్తుకు మంచి కలుగుతుందని భావించి అందరూ సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సందేహాలకు టోల్ ఫ్రీ నంబర్ 9440814263లో సంప్రదించాలని కోరారు.

స్కూల్ రద్దుపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన


నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కరకంబట్టు గ్రామ పంచాయతీ నెరిణికండ్రిగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను రద్దు చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు సోమవారం పాఠశాల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను రద్దు చేసి బుచ్చినాయుడుకండ్రిగలోని పాఠశాలలో విలీనం చేశారని తెలిపారు. 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుచ్చినాయుడుకండ్రిగ పాఠశాలకు చిన్న పిల్లలు వెళ్లటం కష్టమన్నారు. తమ ఊరి పాఠశాలలో చదివే పిల్లలను బుచ్చినాయుడుకండ్రిగలోని పాఠశాలకు పంపించబోమని స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల రద్దును ఆపేసి, పాఠశాలను పునః ప్రారంభించాలని కోరారు.

అంతా అరాచకమే



జగన్‌అంటే నమ్మకం బాబు అంటే మోసం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్

కేవీబీపురం: కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, తప్పుడు కేసులు తప్పా అభివృద్ధి లేదని వైఎస్సార్ సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆరోపించారు. పార్టీ కేవీబీపురం మండల కన్వీనర్ అధ్యక్షతన సోమవారం కేవీబీపురంలో జగన్ అంటే నమ్మకం–బాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యేడాది దాటినప్పటికీ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైనట్టు తెలిపారు. అధికారం కోసం చంద్రబాబు తప్పుడు హామీలు ఇవ్వడం కొత్తేమీ కాదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నిలువునా మోసం చేయడం ఆయన నైజమన్నారు.

ప్రశ్నిస్తే కూటమి కేసులు

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తమ పార్టీనేతలు అడిగితే తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటాలకు తలవొగ్గి తల్లికి వందనం పథకం అమలు చేశారని, అందులోనూ కోతలు విధించి రూ.15 వేలకు బదులు రూ.13 వేలు ఇస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్‌లో భాగమైన ఉచిత బస్సు, నిరుద్యోగభృతి, మహిళలకు రూ.1500 పథకాలను వచ్చే ఎన్నికలకు ముందు ఇస్తారేమోనని తెలిపారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి మహిళలపై దాడులు పెరిగాయని, వారికి రక్షణ లేకుండా పోయిందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పక్కాగా అమలవుతోందని దుయ్యబట్టారు. మరో నాలుగేళ్లు ప్రజలు ఇబ్బంది పడక తప్పదని, మన ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరి కష్టాలు తొలగిపోతాయని తెలిపారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మళ్లీ రామరాజ్యం వస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు బీరేంద్ర రాజు, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు తేరణి ధనుంజయరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మాధవీరెడ్డి, బుచ్చినాయుడుకండ్రిగ మండల అధ్యక్షుడు మణినాయుడు, వరదయ్యపాళెం మండల అధ్యక్షుడు నాయుడు దయాకర్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి లాల్‌బాబు యాదవ్, వైస్ ఎంపీపీ శీనుయాదవ్, వేనాటి చందు, నందకుమార్, దశరథరామిరెడ్డి, శాస్త్రిరాజు, మణి, అయ్యప్ప, గోపి, సర్పంచులు గిరి, రామ్మోహన్, రాజేష్, హరి, భాగ్యరాజ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. కొత్తకండ్రిగకు చెందిన పి.బాలాజీ(33) శ్రీకాళహస్తి మండలంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో కాంట్రాక్ట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుని స్వ గ్రామం వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో బాలాజీ అక్కడికక్కడే మరణించాడు. సీఐ నాగార్జునరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

వరదయ్యపాళెం: మండలంలోని కోవూరుపాడులో కావమ్మ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందుకు ఆలయ ధర్మకర్త సామర్ల మునెమ్మ, నాగభూషణం ఏర్పాట్లు చేశారు. తమిళనాడులోని జంగాలపల్లికి చెందిన కళాకారులు అమ్మవారి కథ గానం చేశారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

రేణిగుంట: పాఠశాలల బస్సు డ్రైవర్లు రహదారి భద్రతా నిబంధనలు తప్పక పాటించాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. రేణిగుంటలో సోమవారం అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాల బస్సులను డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ జయచంద్ర, ఎంవీఐ మోహన్ కృష్ణ, తనిఖీ చేశారు.